సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 9 । జూలై । 2024



ఇంటికే రేషన్ హుళక్కేనా?
ఇంటికే ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీకి స్వస్తి చెప్పేలా మంత్రి నాదెండ్ల చేసిన ప్రకటన తీవ్ర చర్చనీయాంశమైంది. 8లో



కేవీకేలు రైతు నేస్తాలు
కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) రైతు నేస్తాలని శాస్త్రవేత్తలు అన్నారు. ఎన్నార్పీ అగ్రహారంలోని కేవీకేలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారు. 8లో



విజయమే లక్ష్యంగా చదవాలి
విజయమే లక్ష్యంగా క్రమశిక్షణతో విద్యార్థులు చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్‌రెడ్డి అన్నారు. 8లో

న్యూస్‌రీల్

అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : ప్రతి పౌర్ణమి రోజున అరుణాచలం యాత్రకు భీమవరం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ పీఎస్ వీఎం సత్యనారాయణమూర్తి సోమవారం తెలిపారు. ఈనెల 19 నుంచి నాలుగు నెలల పాటు ప్రత్యేక సర్వీసులు నడపుతామన్నారు. ఈనెల 19, ఆగస్టు 17, సెప్టెంబర్ 16, అక్టోబర్ 15వ తేదీల్లో భీమవరం డిపో నుంచి రాత్రి 7 గంటలకు సర్వీసులు మొదలవుతాయన్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, అరుణాచలం, శ్రీపురం, కంచి క్షేత్రాలను సందర్శిస్తామన్నారు. టికెట్ ధర రూ.3 వేలు అని రిజర్వేషన్ కోసం 96660 89036, 9866581333 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, ఐవీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీఎస్ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో ప్రతిభ



రత్నశ్రీని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం : ఏపీ పీజీ సెట్ ప్రవేశ పరీక్షలో భీమవరం డీఎన్నార్ కళాశాల బీఎస్సీ బీజెడ్‌సీ విభాగంలో ఎస్.రత్నశ్రీ నాల్గో ర్యాంకు సాధించిందని కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు తెలిపారు. సోమవారం రత్నశ్రీని అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ జి.మోజెస్, ఏఓ పి.రామకృష్ణంరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొబైల్ రీచార్జ్ ధరలపై మండిపాటు



భీమవరంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం : కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ప్రైవేట్ టెలికం కంపెనీలు మొబైల్ రీచార్జ్ ధరలు భారీగా పెంచి ప్రజలపై రూ.20 వేల కోట్ల భారాన్ని మోపాయని, వీటిని తక్షణం ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం రిలయన్స్ మార్ట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసి అంబానీ కంపెనీ జియోకు ప్రధాని మోదీ ప్రచారకర్తగా ఉండటం దారుణమన్నారు. టెలికం రెగ్యులేటరీ కమిటీ ద్వారా రీచార్జ్ ధరల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పట్టణంలోని బీవీకే గోయంకా మహిళా కళాశాలలో జరుగుతున్న విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత మాతృశక్తి వర్గ సమావేశాల ముగింపు సందర్భంగా సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి రాఘవులు, నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని వినతి

భీమవరం : ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునరుద్ధరించి రైల్వే ప్రయాణికులకు ఊరట కలిగించాలని ప్రయాణికుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సోమవారం టౌన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం తదితరులు మాట్లాడుతూ నెలలు తరబడి మచిలీపట్నం -విశాఖ-భీమవరం- నరసాపురం మధ్య ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయడం దారుణమన్నారు. రైల్వే ట్రాక్ పనుల కారణంగా రద్దు చేసిన రైళ్లను త్వరగా పునరుద్ధరించాలని కోరారు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు లింకు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేదని, దానిని డెమో రైలుగా నిడదవోలు వరకే పరిమితం చేయడం సరికాదన్నారు.



నరసాపురం: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు



తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

మది మదిలో.. జన హృదిలో..

మహానేత
అందుకో మా జోత



భీమవరం : వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

మనసా స్మరామి

- మాజీ సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి
- వాడవాడలా 75వ జయంతి వేడుకలు
- పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు

సాక్షి, భీమవరం: అపర భగీరథుడు.. సంక్షేమ శేఖరుడు.. అభివృద్ధి ప్రదాత.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. జన హృదయ నేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో పలువురు నేతలు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, అర్హులందరికీ సామాజిక పింఛన్లు, పావలా వడ్డీకే రుణాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వైఎస్సార్ వెలుగులు నింపారని, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.

- భీమవరంలోని గునుపూడిలో వైఎస్సార్ విగ్రహానికి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. వీరవాసరం మండలం నవుడూరులో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్ జయంతిని నిర్వహించారు. పేదలకు అన్నదానం, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అంకెం సీతారాం ఆధ్వర్యంలో వైఎస్ జయంతి వేడుకలు జరిగాయి.
- తణుకులో వైఎస్సార్ పార్కు వద్ద గల వైఎస్ విగ్రహానికి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేత చినమిల్లి వెంకట్రాయుడు పాల్గొన్నారు. అత్తిలిలో పార్టీ నాయకులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు జరిగాయి. పోలీస్ ఐలాండ్, బస్టాండ్ సెంటర్ వద్ద వైఎస్సార్ విగ్రహాలకు మాజీ మంత్రి కొట్టు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- ఆచంట నియోజకవర్గంలోని తూర్పుపాలెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవిటంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.
- నరసాపురం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు జరిగాయి. వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పూలపల్లి వైఎస్సార్ జంక్షన్ వద్ద మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, పార్టీ నేత గుణ్ణం నాగబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులు నాయుడు, సంచార జాతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న తదితరులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఉండి నియోజకవర్గం ఆకివీడులో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు మోటుపల్లి గంగాధర్, రసూల్ బీబీ, జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకటరాజు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



పోడూరు : తూర్పుపాలెంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు



వీరవాసరం : నవుడూరులో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



కాళ్ల : పెదఅమిరంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు



పాలకొల్లు అర్బన్ : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి గుడాల గోపి

త్వరలో వినియోగంలోకి ఇసుక రీచ్‌లు



కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): సాధ్యమైనంత త్వరగా జిల్లాలోని ఇసుక రీచ్‌లను వినియోగంలోకి తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నామని, అప్పటివరకు జిల్లా వాసులు సమీపంలోని కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఇసుక నిల్వ కేంద్రాల నుంచి ఉచిత ఇసుక పొందవచ్చని కలెక్టర్, ఇసుక కమిటీ చైర్మన్ చదలవాడ నాగరాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. నిడదవోలు మండలం పందలపర్రు, పెరవలి మండలం పెండ్యాల, ఉసులుమర్రు, రావులపాలెం మండలంలోని రావులపాడు-1,-2, కొత్తపేట కేంద్రాల నుంచి ప్రజలు ఇసుక పొందవచ్చని పేర్కొన్నారు.

లైంగిక వేధింపుల నివారణకు చట్టం

పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే దిశగా జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటుకు శ్రద్ధ వహించాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో అధికారులు, స్థానిక ఫిర్యాదుల కమిటీ నోడల్ అధికారులతో నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చట్టంపై అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

బాల్య వివాహాల కట్టడికి చర్యలు

జిల్లాలో బాల్యవివాహాలు ఎట్టి పరిస్థితుల్లో జరగడానికి వీలులేదని, బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో మాత్రమే ఉంచాలని కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ సి.నాగరాణి జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై ఆయా కార్యక్రమాలపై సమీక్షించారు.

179 అర్జీల స్వీకరణ

ప్రజల సమస్యలను శ్రద్ధతో సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావుతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. కొన్ని శాఖల్లో ఫిర్యాదులు తిరిగి ఓపెన్ కాకుండా చూడాలన్నారు. మొత్తంగా 179 అర్జీలను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు.

ఇసుక సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

నరసాపురం: జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని బోట్స్‌మెన్ సొసైటీల ప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నరసాపురం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, యలమంచిలి, చించినాడ ప్రాంతాల్లోని పాయింట్లలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు యుద్ధప్రాతిపదిక పొందాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వలు, ఉచిత ఇసుక సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆర్డీఓ ఎం. అచ్యుత్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

ఉండి: ఐటీఐ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుని ముందుకు సాగాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్, జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. మేళా జిల్లా నలుమూలల నుంచి సుమారు 236 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐటీఐ, ఒకేషనల్ విద్యార్థులకు అప్రెంటీస్ పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులు నిర్లక్ష్యంగా చేయకుండా అప్రెంటీస్ పూర్తిచేయాలని సూచించారు. విద్యార్థులు ఐటీఐ కోర్సులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఐటీఐ, ఒకేషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీనివాసరాజు

డీజీపీకి వినతి

ఏలూరు టౌన్ : ఎన్నికల విధుల్లో భాగంగా ఆయా జిల్లాలకు బదిలీ చేసిన పోలీసు అధికారులను తిరిగి వారి జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావుకు వినతిపత్రం అందజేశామని పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీతో కలిసి డీజీపీకు వినతిపత్రం అందజేశామన్నారు.

ఇంటర్వ్యూకి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..

- కంటైనర్‌ను ఢీకొట్టిన కారు
- ముగ్గురు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

ద్వారకాతిరుమల : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి భర్తతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడాలనుకుంది. రత్నాల్లాంటి ఇద్దరు బిడ్డలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని ఎన్నో కలలు కంది. సాఫ్ట్‌వేర్ కంపెనీ నుంచి ఇంటర్వ్యూకు పిలుపురాగానే సంబరపడిపోయింది. ఉద్యోగం ఎలాగైనా సాధించాలన్న పట్టుదలతో అడుగు ముందుకేసింది. అయితే అకాల మృత్యువు ఆమె కలలను చెరిపివేసింది. రోడ్డు ప్రమాదానికి గురై తన తల్లి, బిడ్డతో సహా ఆమె అసువులు బాసింది. వీడని బంధంలా మృత్యువులోనూ ఆమె ఒడిలో బిడ్డ పడి ఉన్న దృశ్యాలు కలచివేశాయి. ఈ హృదయ విదారక ఘటన ద్వారకాతిరుమల మండలం మారంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలుకి చెందిన రాచాబత్తుని నాగార్జున హైదరాబాద్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఎండీగా చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువు సాధించి భర్తతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడాలని భావించిన నాగార్జున భార్య భాగ్యశ్రీ (30), కుమారుడు నాగ నితిన్‌కుమార్ (4), నాగ షణ్ముఖ, తల్లిదండ్రులు బొమ్మా నారాయణరావు, కమలాదేవి (57)తో కలిసి హైదరాబాద్‌కు కారులో వెళ్లి వస్తుండగా లక్ష్మీనగర్‌లో రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. దీంతో భాగ్యశ్రీ, కమలాదేవి, నాగ నితిన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, నాగ షణ్ముఖ, డ్రైవర్ దీవి వంశీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. తండ్రి నారాయణరావు మార్గమధ్యలో విజయవాడలో కారు దిగిపోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



రాచాబత్తుని భాగ్యశ్రీ, నాగ నితిన్ కుమార్, బొమ్మా కమలాదేవి మృతదేహాలు



ఘటనా స్థలంలో రోదిస్తున్న మృతుల బంధువు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

క్లుప్తంగా

'అగ్నివీర్'లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): భారత వాయుసేనలో అగ్నివీర్ పథకంలో భాగంగా ఉద్యోగాల నియామకం కోసం భారత వాయుసేన నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 2004 జూలై నుంచి 2008 జనవరి మధ్య జన్మించిన స్త్రీ/పురుష అభ్యర్థులు అర్హులన్నారు. మేథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఇంటర్మీడియేట్‌లో, ఒకేషనల్ లేదా పాలిటెక్నిక్‌లలో కనీసం 50 శాతం మార్కులతో పాస్ అయిన వారు అగ్నిపథ్ వెబ్ సైట్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్ పరీక్ష అక్టోబర్ 10వ తేదీ నుంచి నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులకు ఈ ఉద్యోగాలపై అవగాహన కలుగజేసేందుకు ఈ నెల 12న భీమవరంలోని డీఎన్ఆర్ డిగ్రీ కాలేజీలో, 16న ఏలూరులోని సర్ సీఆర్ఆర్ రెడ్డి కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాయుసేన సికింద్రాబాద్ వారితో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలలని జిల్లా ఉపాధి అధికారి కోరారు.

వైనాట్‌కు సోనీ సేల్స్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వైనాట్ అధినేత వెంకటరాయుడు

తణుకు: హోం అప్లయన్సెస్ విభాగంలో 2023–24 సంవత్సరానికి సోనీ సేల్స్ ఎక్సలెన్స్ అవార్డును తణుకు వైనాట్ సంస్థ కైవశం చేసుకుంది. సోనీ గృహోపకరణాలు అధిక మొత్తంలో అమ్మకాలతోపాటు ఉత్తమ సేవలు అందిస్తూ ఖాతాదారుల నమ్మకాన్ని చూరగొంటూ అందరి మన్ననలు పొందింది. తణుకులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మక సోనీ సేల్స్ ఎక్సలెన్స్ అవార్డును సోనీ బీఎం సంఘమేష్, భాస్కర్‌లు వైనాట్ అధినేత జుజ్జవరపు వెంకటరాయుడుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నమ్మకమే మరో మెట్టు పెంచిందని అన్నారు.

సరికొత్త ఫీచర్లతో 'ఈస్టర్న్ పవర్' యాప్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆ సంస్థ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగదారుని 16 అంకెల విద్యుత్ సర్వీసు నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా యాప్ సేవలను పొందవచ్చన్నారు. ఈ యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను అదనపు రుసుము లేకుండా సులభంగా చెల్లించవచ్చన్నారు. విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. 'మై యూసేజ్' ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్ రీడింగ్ ప్రకారం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్య నమోదు ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చని ఎస్ఈ వివరించారు.

ఇంటింటికీ రేషన్ హుళక్కేనా?

- ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటా రేషన్ పంపిణీకి మంగళం?
- జిల్లాలో మూతపడనున్న 356 ఎండీయూ వాహనాలు
- కూటమి సర్కారు తీరుతో కార్డుదారుల్లో అనుమానాలు
- మళ్లీ కనిపించనున్న రేషన్ షాపుల వద్ద పడిగాపుల దృశ్యాలు
- జిల్లాలో 5,70,916 మంది తెల్ల కార్డుదారులు


ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)


నరసాపురం ప్రాంతంలో ఎండీయూ ద్వారా సేవలందిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆకివీడు: వైఎస్ జగన్ సర్కారు అమలు చేసిన ప్రజాదరణ చూరగొన్న సంక్షేమ పథకాల పేర్ల మార్పే కాదు, వాటి విధానాలకు తిలోదకాలిచ్చి ప్రజల తలరాతల్ని కూటమి ప్రభుత్వం మార్చివేస్తోంది. సంక్షేమ పథకాల్ని అమలు జరుపుతూనే కొత్త సంక్షేమ, అభివృద్ధి పథకాలను తీసుకువస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచిన కూటమి ప్రభుత్వం నెల రోజులు తిరగకుండానే సంక్షేమ పథకాల అమలుపై ఆయా శాఖల మంత్రులు మాట్లాడుతున్న తీరు ప్రజల్ని అయోమయంలో పడవేస్తున్నాయి. ఎన్టీ రామారావు ప్రవేశపెట్టిన అతి ముఖ్యమైన బియ్యం పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కిలో రూపాయికే పంపిణీ చేసి కొనసాగించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఈ విధానాన్ని మరింత మెరుగ్గా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా ప్రజల ఇళ్లకే వెళ్లి రేషన్ బియ్యం సరఫరా చేశారు. అయితే ఎండీయూ పథకానికి స్వస్తి చెప్పేలా ప్రస్తుత ప్రభుత్వంలో శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులతోపాటు రేషన్ పొందుతున్న వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ చౌకబారు మార్పులు మాకొద్దంటూ పలువురు వాపోతున్నారు.

8,000 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

అత్యంత ప్రతిష్టాత్మకంగా రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. 2021 జనవరి 21వ తేదీన ఎండీయూ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఫిబ్రవరిలో అన్ని గ్రామాల్లో పంపిణీ ప్రారంభమైంది. ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా పశ్చిమగోదావరి జిల్లాలో సుమారుగా 8,000 మెట్రిక్ టన్నులకు పైగా బియ్యాన్ని ప్రజల చెంతకు చేరవేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి 5,70,916 మంది రేషన్ కార్డు దారులకు బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇంటర్‌నెట్ అందుబాటులో లేకపోయినా, సర్వర్లు పనిచేయకపోయినా, ఇంటి వద్ద యజమాని లేకపోయినా, వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ ఓర్పు, సహనంతో 356 ఎండీయూ ఆపరేటర్లు బియ్యం లోడు వాహనాలతో ఆయా ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు నిజాయతీగా బియ్యం అందజేస్తూ వస్తున్నారు. తూకంలో ఏ విధమైన లోపం లేకుండా, కార్డుదారుడికి 5 కేజీల బియ్యం వారి ముందే తూచి అప్పగిస్తున్నారు. ఉచిత బియ్యమైనప్పటికీ ఒక్క గింజ తేడా లేకుండా ఎండీయూల ద్వారా పంపిణీ జరిగింది. ఈ–పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో ప్రజా పంపిణీ విధానం కొనసాగింది. ఎండీయూల ద్వారా ఇంటింటికీ బియ్యం సరఫరా చేయిస్తూనే, జిల్లాలోని 1052 రేషన్ షాపుల ద్వారా రేషన్ బియ్యాన్ని ఆయా డీలర్ల నుంచి ఎండీయూలకు చేరవేసే పద్ధతిని కొనసాగించారు.

బిక్కుబిక్కుమంటున్న ఎండీయూ ఆపరేటర్లు

వాహనాల ద్వారా రేషన్ బియ్యం సరఫరాపై ఆ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలతో తాము ఉపాధి కోల్పోతామేమోనన్న ఆందోళనలో ఎండీయూ నిర్వాహకులు ఉన్నారు. ఐదేళ్లు సేవలందించిన తమ సేవల్ని నిర్వీర్యం చేయడమే కాకుండా, మా జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో వైఎస్ జగన్ సర్కారు బ్యాంకుల లింకేజీతో ఒక్కో వాహనాన్ని రూ.5.80 లక్షల చొప్పున అందజేశారు. లబ్ధిదారుడు నెలకు రూ.3 వేలు చెల్లింస్తుండగా, ప్రభుత్వం రూ.8 వేలు ప్రతి నెలా బ్యాంకులకు చెల్లిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎండీయూ నిర్వాహకులు సేవలందించారు. ఇప్పుడు ఇంటింటికీ రేషన పంపిణీ పథకం రద్దు అయితే వాహనాల సంగతేమిటి, తమ పరిస్థితి ఏమిటని నిర్వాహకులు వాపోతున్నారు.

దేశానికి ఆదర్శం

రేషన్ పంపిణీలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన విధానంపై దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఎండీయూ పథకం దేశానికే ఆదర్శంగా ఉంటే రాష్ట్రంలో తూట్లు పొడిచే దిశగా ఆలోచనలు ఉన్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది.

ఈ విధానాన్నే కొనసాగించాలి



రేషన్ కష్టాల్ని తొలగించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్నే కొనసాగించాలి. ఇంటికే వచ్చి రేషన్ ఇవ్వడం వల్ల లబ్ధిదారులు తమ పనుల్ని మానుకోవాల్సిన అవసరం లేకుండా ఉంది. సకాలంలో వారికి రేషన్ బియ్యం అందుతున్నాయి. ఈ విధానాన్ని కొనసాగించాలి.

– నాతిరెడ్డి ఆదిలక్ష్మి, సర్పంచ్, చినకాపవరం, ఆకివీడు మండలం

కష్టకాలంలోనూ సేవలందించాం



కష్టకాలంలో ఎనలేని సేవలందించిన మాపై లేనిపోని నిందలు వేయడం తగదు. కాకినాడ పోర్టు గొడౌన్లలో ఉన్న అక్రమ బియ్యానికి మాకు ఏ విధమైన సంబంధం లేదు. మేము నిజాయతీగా పేదల ఇళ్లకు వెళ్లి పక్కా కొలతతో రేషన్ అందజేశాం. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది.

– జువ్వల ప్రేమ్‌కుమార్, ఎండీయూ ఆపరేటర్ల సంఘ జిల్లా అధ్యక్షులు, నర్సాపురం

రూ.6.85 లక్షల విలువైన విత్తనాల అమ్మకాలు నిలుపుదల


ఆరుగొలనులో విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను గ్రామంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో సోమవారం రాష్ట్ర స్థాయి ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ బృందంలో విజయనగరం జిల్లా గజపతినగరం ఏడీఏ కే.మహారాజన్, తూర్పుగోదావరి జిల్లా విజిలెన్స్ సీఐ శ్రీనివాస రెడ్డి, వ్యవసాయాధికారులు కే.కృష్ణకాంత్, ఆర్ఎస్.ప్రసాద్, కే.పార్థసారథి ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో రిజల్ట్ సరిగా లేకపోవడంతో రూ.6.85 లక్షల విలువ గల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తాడేపల్లిగూడెం ఏవో ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. అలాగే, ఎల్.అగ్రహారం సీ అండ్ ఎఫ్ పురుగు మందుల దుకాణంలోనూ, పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలోని ఐఎస్‌టీ గోదాములోనూ తనిఖీలు నిర్వహించారు.

తాడువాయిలో చోరీ

జంగారెడ్డిగూడెం: కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రిస్తుండగానే ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారపు ఆభరణాలు అపహరించారు. ఏఎస్సై వై.మంగయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడువాయికి చెందిన పసుమర్తి ఏడుకొండలు ఈ నెల 7వ తేదీ రాత్రి కుటుంబసభ్యులతో ఆరుబయట నిద్రించారు. 8వ తేదీ ఉదయం లేచి చూడగా, ఇంటి వెనుక తలుపు గొళ్లెం ఊడదీసి, లోనికి ప్రవేశించి బెడ్‌రూమ్‌లోని బీరువా తాళాలు పగులగొట్టి, అందులో ఉండాల్సిన 9 కాసుల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. మంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కృషి విజ్ఞాన కేంద్రాలు రైతు నేస్తాలు

- ఉద్ఘాటించిన పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు
- ఎన్నార్పీ అగ్రహారం కేవీకేకు చేరుకున్న స్వర్ణోత్సవ జ్యోతి


ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో స్వర్ణోత్సవ జ్యోతితో శాస్త్రవేత్తలు

ఉండి: కృషి విజ్ఞాన కేంద్రాలు రైతు నేస్తాలని పలువురు శాస్త్రవేత్తలు అన్నారు. దేశంలో మొదటి కేవీకే పాండిచ్చేరీలో స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దేశంలోని అన్ని కేవీకేల్లో స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన స్వర్ణోత్సవ జ్యోతియాత్ర వెంకట్రామన్నగూడెం కేవీకే నుంచి ఎన్నార్పీ అగ్రహారం కేవీకేకు సోమవారం చేరుకోగా, శాస్త్రవేత్తలు, రైతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన రైతు శిక్షణ సదస్సులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ దండు జగన్నాథరాజు, మార్టేరు మాజీ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ కె.సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు సదస్సుకు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథి డాక్టర్ కే సూర్యనారాయణ మాట్లాడారు. ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో పంటల యాజమాన్య విభాగంలో నాలుగేళ్లపాటు చౌడునేల అభివృద్ధిపై తాను చేసిన పరిశోధనలను వివరించారు. మాండలెజ్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ జే విజయ్‌కుమార్ మాట్లాడుతూ కోకో పంటలో ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆర్జించే అవకాశాలున్నట్లు తెలిపారు. మరో అతిథి దండు జగన్నాథరాజు మాట్లాడుతూ ఎన్నార్పీ అగ్రహారం కేవీకే స్థాపించిన సమయంలో తాను పనిచేశానని, రైతులను ప్రోత్సహించి వరి విత్తనోత్పత్తి, శ్రీవరి సాగు, చౌడు భూముల అభివృద్ధి, వరిలో సన్నగింజ రకాలు, హైబ్రీడ్ వరి రకాలు పండించి ఈ ప్రాంతానికి అనువైన బీపీటీ జగిత్యాల రకాలను రైతులు విరివిగా పండించేట్లు చేశామని తెలిపారు. అనంతరం అభ్యుదయ రైతులు ఐవీ నర్సింహరాజు, యన్.చల్లారావు, బి.శ్రీనివాసరావు, తాడితోట నర్సింహరావు, రవిరాజు, జే లక్ష్మీనారాయణ కేవీకేతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దెబోరా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి.వినయలక్ష్మి, రజిత, రైతులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరుకు పతకాల పంట

ఏలూరు రూరల్: కేంద్రీయ విద్యాలయాల రీజినల్ స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు విద్యార్థులు 15 పతకాలు సాధించారని శాప్ స్విమ్మింగ్ కోచ్ గణేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాల ఆటల పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో ఏలూరు భిశ్వనాథ్ స్విమ్మింగ్ పూల్ వద్ద శిక్షణ పొందుతున్న గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు 7 గోల్డ్‌మెడల్స్, 5 సిల్వర్, 3 బ్రాంజ్‌మెడల్స్ సాధించారన్నారు. ఇందులో 50, 100 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో మరియన్న రెండు బంగారు పతకాలు, ఎం.ధనుష్‌సాయి 50, 100 మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో మూడు బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడన్నారు. మరోవైపు ఎం.రిషీరామ్ 50, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ అంశంలో రెండు బంగారు పతకాలు, ఎం.సంజయ్ 50 మీటర్ల బటర్‌ఫ్లై, 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో 1 సిల్వర్, మరొక బ్రాంజ్‌మెడల్ చేజిక్కించుకున్నారని వివరించారు. అలాగే టి.అవినాష్ 100 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో ఒక సిల్వర్ మెడల్, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బ్రాంజ్ మెడల్, టి.విష్ణువర్ధన్ 50, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్ అంశంలో మూడు సిల్వర్ మెడల్స్, ఎం.రోయ్‌సన్ 50 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో బ్రాంజ్ మెడల్ సాదించారని పేర్కొన్నారు. వీరిని డీఎస్‌డీఓ శ్రీనివాస్ అభినందించారు.

వాహనచోదకులు తప్పక హెల్మెట్ ధరించాలి

నూజివీడు: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ అన్నారు. నూజివీడు కోర్టు ఆవరణలో సోమవారం ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వలన అధిక శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కేసులు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో ప్రమాదం సంభవిస్తే హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. రోడ్డుపై జరగబోయే ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. తాజాగా హైకోర్టు ఆదేశాల మేరకు కేసులు నమోదుతో పాటు కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

6 ట్రాక్టర్ల సీజ్

చాట్రాయి: మట్టి అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాట్రాయి గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకుని వాటిని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

నాటిక పోటీల విజేత 'ఇంద్రప్రస్థం'

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ), హేలాపురి కళాపరిషత్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో ఇంద్రప్రస్థం నాటిక విజేతగా నిలిచింది. ఆదివారం రాత్రి నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలైన నాటిక బృందాలకు అతిథులు బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన ఇంద్రప్రస్థం బృందానికి రూ.8 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రాత నాటిక బృందానికి రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కౌసల్య సుప్రజ రామ బృందానికి రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు. ఉత్తమ నటునిగా ఎస్.రవీంద్ర, ద్వితీయ ఉత్తమ నటునిగా పీ శ్రీనివాసరావు, ఉత్తమ నటిగా టీ శ్రీలేఖ, ద్వితీయ ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, ఉత్తమ ప్రతినాయకునిగా ఏపూరి హరిబాబు, ఉత్తమ హాస్య నటునిగా పూర్ణ సత్యం, ఉత్తమ బాలనటిగా సురభి వాగ్దేవి, ఉత్తమ సంగీతం పీ లీలామోహన్, ఉత్తమ రచనలుగా ఇంద్రప్రస్థం (స్నిగ్ధ), రాత (శ్రీనివాసరావు పోలదాసు), ఉత్తమ దర్శకునిగా శ్రీనివాసరావు పోలదాసు బహుమతులు అందుకున్నారు. బహుమతి ప్రదానోత్సవ సభకు అతిథులుగా వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఇరదల ముద్దుకృష్ణ, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు జవ్వాజి మోహన్ విఠల్, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్య కాంతారావు, సంస్థ సభ్యులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు లంకా వెంకటేశ్వర్లు, హేలాపురి కళాపరిషత్ అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు గుత్తా కౌసలేంద్రరావు, కార్యదర్శి సంకు సురేష్, కోశాధికారి ఎండీ ఖాజావలి, పైడి భీమేశ్వరరావు, ఘంటసాల పెద్దిరాజు, ఎం.సూర్యనారాయణ యాదవ్, పచ్చ కృష్ణానందరావు, చన్నా వెంకటరామయ్య, వీ రేవతి, కొల్లి మోహన్‌రావు, ఎంపీ సోమేశ్వరరావు, జిల్లెళ్ల మూడి వరప్రసాదరావు, కేసా సాంబశివరావు, బీ విశ్వనాథచారి పాల్గొన్నారు.


నాటిక పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి 6 నెలల జైలు

చింతలపూడి: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 6 నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబుతీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యర్రగుంటపల్లికి చెందిన మందపాటి వెంకటేశ్వరమ్మ చింతలపూడిలోని ఓ హోటల్‌లో పనిచేస్తోంది. 2022 మే 22న తన ఇంటి నుంచి చింతలపూడికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా, మార్గమధ్యలో వాహనం ఆగిపోయింది. బస్సు కోసం ఎదురుచూస్తుండగా, చింతలపూడి వైపు బైక్‌పై వెళుతున్న యర్రగుంటపల్లికి చెందిన పెరుమాళ్ల సువర్ణరాజు చింతలపూడి వరకు లిఫ్ట్ ఇస్తానని ఆమెను బైక్‌పై ఎక్కించుకుని రేచర్ల శివారులో పక్కకు ఆపి, ఆమెను పక్కనే ఉన్న ఆయిల్ పామ్ తోటలోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. వెంకటేశ్వరమ్మ తప్పించుకుని, విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా, వారి సాయంతో చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై పి.చెన్నారావు కేసు నమోదు చేశారు. దీనిపై కోర్టులో విచారణ జరగ్గా నిందితుడి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష శిధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ ఎం.సుధాకర్ తెలిపారు. పీపీ వి.సామయ్య ప్రాసిక్యూషన్ నిర్వహించగా, ఎస్సై ఎం.కుటుంబరావు సహకరించారు.

విజయమే లక్ష్యంగా చదవాలి

నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: విజయమే లక్ష్యంగా క్రమశిక్షణతో విద్యార్థులు చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇన్‌స్పైర్ మనాక్ మెంటర్‌షిప్ అనే అంశంపై మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక వికాసానికి విద్యే కారణమన్నారు. పాఠశాల విద్య నుంచే బలమైన పునాదులు వేసుకుంటే ప్రతి విద్యార్థి పరిశోధకుడిగా మారతారన్నారు. బట్టీ చదువులతో మార్కులు సాధించవచ్చు కానీ మేధావులుగా రాణించలేరన్నారు. సృజనాత్మక ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు, ప్రాజెక్టులు, స్టార్టప్‌లతో విద్యార్థులు మెరవాలన్నారు. శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు గణితం, సైన్సు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. విజేతల వెనుక ఎటువంటి అదృష్టం, తారకమంత్రం ఉండవని, చక్కని ప్రణాళికతో, అంకితభావం, కఠోర శ్రమ, వంటి బ్రహ్మాస్త్రాలు ఉంటాయన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే బహుముఖ నైపుణ్యాలను పొందాలని, పరిశోధనల్లో కొత్త శిఖరాలను అందుకోవాలని డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ శాస్త్రి, ఫౌండేషన్ అసోసియేట్ డైరెక్టర్ సునీల్ భాస్కర్, నోడల్ ఆఫీసర్ భాగ్యశ్రీ అన్నారు. ఆచార్యులు వి.సందీప్, పి.శంకర్, సుదర్శన్‌దీప, వినోత్‌కుమార్, భరణీ ధరన్, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

తాడేపల్లిగూడెం అర్బన్: ఆరుళ్ల గ్రామ సమీపంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కొన్ని రోజుల క్రితమే ఈ హత్య జరగగా, దుర్వాసన వస్తోందని స్థానికులిచ్చిన సమాచారంతో పోలీసులు మహిళ మృతదేహాన్ని గుర్తించడంతో హత్య విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరుగొలను గ్రామానికి చెందిన జనపాముల సత్యవతి (48) వారం క్రితం తాడేపల్లిగూడెంలోని బంధువుల ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కుటుంబ సభ్యులకు తెలియలేదు. వారం రోజులైనా తల్లి ఇంటికి రాకపోవడంతో ఆమె కుమార్తె బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో తన తల్లి కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా ఆరుళ్ల గ్రామస్తులు రహదారిలో రాకపోకలు సాగిస్తుండగా భరించలేదని దుర్వాసన వస్తోందని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుధాకర్‌రెడ్డి సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, మహిళ మృతదేహాన్ని ఆరుగొలను గ్రామానికి చెందిన జనపాముల సత్యవతిగా గుర్తించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఆమెను గొంతు నులిమి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆధారాలను సేకరిస్తున్న ఎస్సై సుధాకర్‌రెడ్డి

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



డైమండ్స్ కార్యాలయంలో శ్రీహరిని సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఏలూరులో క్రాంతి కల్యాణ వేదికలో జూలై 21వ తేదీ ఆదివారం 316జీ లయన్స్‌క్లబ్ జిల్లా కాబినెట్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని జిల్లా కాబినెట్ ఆక్టివిటీస్ సెక్రటరీ లయన్ మద్దుకూరి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. పట్టణంలో సోమవారం లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అధ్వర్యంలో డైమండ్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శ్రీహరి పాల్గొని జిల్లా మీటింగ్ ఆహ్వానంను క్లబ్ ప్రతినిధులకు అందజేశారు. జిల్లా సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, వి.రామారావు, కె.నిరంజన్‌కుమార్, సుంకర శ్రీనివాస్, కాళ్ళ గోపికృష్ణ, కొప్పేళ్ల సాయి సత్యనారాయణ రాజు, మాధురి తదితరులు పాల్గొన్నారు.

కారుమూరి పరామర్శలు



నూకల కనకదుర్గను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకులో వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురిని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు సోమవారం పరామర్శించారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గను, ఆపిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీసీవై కన్వీనర్ మురాల సుధాకర్‌ను కారుమూరి పరామర్శించారు. ఆయన వెంట కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు, ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ముళ్లపూడి బాబూరావు తదితరులు ఉన్నారు.

కళాశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గోయెంకా మహిళా కళాశాల అభివృద్ధి దాతలు సహకారం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం బీజేపీ నాయకులు నరిశే సోమేశ్వరరావు వాటర్ ప్యూరిఫైర్ మిషన్ నిమిత్తం రూ. 70 వేలు చెక్కును సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ వెంపరాల గణపతి రామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత్ విశ్వ హిందూ పరిషత్ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి రాఘువులు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల విరాళం



హెచ్‌ఎంకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మొగల్తూరు: స్థానిక పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. కొద్దిపాటి వర్షానికే మునిగిపోతున్న పాఠశాల ఆవరణను ఇసుకతో పూడ్చాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు నిర్ణయించారు. మొగల్తూరు పంచాయతీ పాలవకర్గ సభ్యులు 200 ట్రక్కులు ఇసుకను హైస్కూల్ గ్రౌండ్‌లో వేయించారు. మరో 600 ట్రక్కుల ఇసుక అవసరమవడంతో 10వ తరగతి 1988–89 బ్యాచ్ విద్యార్థులు గుబ్బల చంద్ర మౌళీశ్వరి, రాయుడు చంద్ర శేఖర్, అనంతపల్లి కృష్ణలు రూ.10 వేలు చొ ప్పున, అనంతపల్లి కిరణ్, రాజా పండు, కుక్క ల శివ శంకర ప్రసాద్‌లు రూ.5 వేలు చొప్పున ప్రధానోపాధ్యాయుడు రవి శంకర్‌కు సోమ వారం అందించారు. అనంతపల్లి కృష్ణ, గుండు రామ కుమార్, వేండ్ర నాగరాజు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడిగా గోపి

యలమంచిలి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ యలమంచిలి లంక సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం యలమంచిలిలో సమావేశమైన సర్పంచ్‌లు పెనుమర్రు సర్పంచ్ కవురు గోపిని మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గోపికి శాలువా కప్పి అభినందించారు.

ఆరోగ్య ప్రదాత, రైతు బాంధవుడు వైఎస్సార్

తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్లలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



తణుకు వైఎస్సార్ పార్కులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



దువ్వ గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలు



అత్తిలి మండలం గుమ్మంపాడులో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మండపాకలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

తణుకు అర్బన్: ఆరోగ్యప్రదాత, రైతు బాంధవుడిగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో కొలువుతీరి ఉన్నారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం తణుకు రాష్ట్రపతి రోడ్డు, వైఎస్సార్ పార్కులోని వైఎస్సార్ విగ్రహాలకు మాజీ మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా లక్షలాది మందికి ఖరీదైన వైద్యం ఉచితంగా అందజేసిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. అన్నదాతగా రైతుకు గౌరవం పెంచడమే కాకుండా రైతాంగానికి పెద్దపీట వేశారని అన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని రూ. 25 లక్షలకు పెంచారని, అక్కచెల్లెమ్మలకు సంక్షేమం అందజేశారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేయాలని, ఇప్పటికే రైతాంగం తమకు రావాల్సిన సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభించడంతో తల్లి తండ్రులు తల్లికి వందనం పథకం డబ్బుకోసం ఎదురుచూస్తున్నారని గుర్తుచేశారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి సమయం ఇస్తామని ప్రజలు తమ సమస్యల కోసం రోడ్డెక్కిన రోజున వారి తరపున పోరాటానికి దిగుతామని చెప్పారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం వద్ద కేకు కట్‌చేసి, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు, యిండుగపల్లి బలరామకృష్ణ, పాట్ల సురేష్, ఉండవల్లి జానకి, వి.సీతారాం, చోడే గోపికృష్ణ, కుడుపూడి చంద్రరావు, డీజే అమూల్యా రావు, రంభ నాగేశ్వరరావు, షేక్ జిలాని, మారిశెట్టి శేషగిరి, జల్లూరి జగదీష్, నారాయణ అప్పారావు, అభిషేక్, కొమ్మోజు రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ, త్రిమూర్తులు, చింతన్న పాల్గొన్నారు.

కారణజన్ముడు మహానేత వైఎస్సార్

తాడేపల్లిగూడెం అర్బన్ : మహానేత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి కారణజన్ముడని మాజీ ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద, ఆర్టీసీ డిపో వద్ద వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆరోగ్యశ్రీ,,108 వంటి సదుపాయాలను పేదలకు చేరువచేశారన్నారు. తండ్రి అడుగు జాడల్లోనే కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. విద్య, వైద్యంతో పాటు ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసి ప్రజల మనసుల్లో నిలిచిపోయారన్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికే ఓట్లు వేశాం మా ఓట్లు ఏమయ్యాయని ప్రజలు ఎలుగెత్తి ప్రశ్నలు వేస్తున్నారని కొట్టు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు అవినీతి రహిత పాలన అందిస్తామని చెబుతున్నమాటలు ఎంతవరకు ఆచరిస్తారో చూడాలన్నారు. గత ఐదేళ్లలో అనధికారిక లేఅవుట్లను నిలువరించామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఇటువంటి అనధికార లేఅవుట్లను నిలువరించగలరా అని మంత్రి కొట్టు ప్రశ్నించారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించి అమ్మకాలు చేసిన అవినీతి పరులు ఎమ్మెల్యే చుట్టూ ఉన్నారన్నారు. అనంతరం పేదలకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంచారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కర రావు, కొలుకులూరి ధర్మ రాజు, బొద్దు సాయిబాబా, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, పీతల సుధాకర్, చిటికన ప్రసాద్, జిడ్డు హరిబాబు, బొద్దాని శ్రీనివాస్, నీలం భూషణం, తెన్నేటి జగ్జీవన్, చామన సూర్యచంద్రరావు, సూరంపూడి రామకృష్ణ, మార్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

తణుకు టౌన్: దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సోమవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, పార్టీ అధ్యక్షుడు గోపాల కృష్ణ, మండల రైతు విభాగం అధ్యక్షుడు డీవీ కృష్ణంరాజు, ఎంపీటీసీలు పీ అశోక్, టీ శ్రీనివాస్‌లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముద్దాపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, ఎంపీటీసీ కామన కృష్ణవేణి, నాయకులు తుమ్మగంటి నాగ సత్యనారాయణ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు శ్యామల, తాడిపర్తి సుజాత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తేతలి గ్రామంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, నాయకులు, దారం శ్రీను, భూపతిరాజు రామకృష్ణంరాజు, కోట స్వామీజీ, పవన్, మానేపల్లి సంపత్‌రావు, తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండపాక గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, రామారావు, రవికాంత్, వెంకటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కోనాల గ్రామంలో గ్రామ సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాబీ, తదితరులు పాల్గొన్నారు. కొమరవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జన హృదయ నేత వైఎస్సార్

తాడేపల్లిగూడెం రూరల్: అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత వైఎస్సార్ అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జిడ్డు హరిబాబు అన్నారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌పాలన సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. జగన్నాథపురంలో ముప్పిడి లక్ష్మణరావు, కుంచనపల్లిలో తాడేపల్లి మోషే, ఉర్ల నవీన్, కనుపూరి ఉదయభాస్కర్, పుల్లాయగూడెంలో ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బా రావు, నవాబుపాలెంలో మద్దుకూరి మెహెర్‌ప్రసా ద్, కృష్ణాయపాలెంలో కంఠమని సత్యనారాయణ, వీరంపాలెంలో సర్పంచ్ కేతిరెడ్డి మాధవీలత, ముప్పిడి వెంకట్రామిరెడ్డి, బంగారుగూడెంలో చుండ్రు శ్రీనివాస్, చిన తాడేపల్లిలో సర్పంచ్ పిచ్చుకల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, కడియద్దలో సర్పంచ్ యాతం కోటేశ్వరి, ఆరుగొలనులో ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, నీలాద్రిపురంలో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, పెదతాడేపల్లిలో పరిమి తులసీదాస్, దండగర్రలో ములగాల గంగారావు, కొమ్ముగూడెం, పట్టింపాలెం తదితర గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.

మహోన్నత వ్యక్తి వైఎస్సార్

అత్తిలి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను సోమవారం అత్తిలిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు మాజీ మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి చేతుల మీదుగా పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచిన నేత వైఎస్సార్

పెంటపాడు: వైఎస్సార్ అంటే సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పలువురు వక్తలు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు, వైఎస్ అభిమానులు వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాల వద్ద పార్టీ నాయకులు నల్లమిల్లి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామ వార్డు సభ్యులు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (బస్సులరెడ్డి) ఆధ్వర్యంలో పాఠశాల, వైఎస్సార్ విగ్రహాల వద్ద కేక్‌లు కట్ చేశారు. పెంటపాడు ఊరచెరువు, కోనేరు చెరువుల వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద కేక్‌లు కట్ చేసి రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి, పార్టీ యూత్ మండల శాఖ అధ్యక్షుడు కొవ్వూరి బాస్కరరెడ్డి, శింగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, మారంపూడి ఏసుదాసు, కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, తాడేపల్లి ఈశ్వరరావు, ఏఎంసీ మాజీ వైఎస్ చైర్మన్ జామి కృష్ణ, డైరెక్టర్‌లు కర్రి వరహాలరెడ్డి, సలుమూరి ప్రకాష్, దాసరి నరేష్, ప్రభాకరరెడ్డి, శివారెడ్డి, బండారు రాంబాబు, చదల వాడ శ్రీను, కర్రి పృధ్వీకుమార్‌రెడ్డి, పెంటపాడు జగన్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు. కొండేపాడు గ్రామంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మద్రే కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతిల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పరిమెళ్లలో ఎస్సీపేట పార్టీ యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జట్లపాలెం గ్రామంలో మండల వ్యవసాయ సలహామండలి మాజీ అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, సర్పంచ్ ఖండవల్లి మణిరాజుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్సీపేటలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెంటపాడు వెలంపేట ప్రాంతంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బర్ల జయరాంబాబుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలంపురం గ్రామంలో ఎస్సీపేట యూత్ ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

ఇరగవరం: మండలంలోని 21గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ జయంతి 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు వైఎస్సార్ విగ్రహలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడులో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అలంపురం ఎస్సీపేట యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు



అత్తిలిలో వైఎస్సార్ జయంతి సందర్భంగా రగ్గులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మాధవరం గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జిడ్డు హరిబాబు



తేతలి గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

తణుకులో పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



వెంకట్రాయపురంలోని పురుగుల మందులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తణుకు టౌన్: తణుకు మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం తణుకు వెంకట్రాయపురంలోని జయలక్ష్మీ ఫెర్టిలైజర్స్, మండపాక గ్రామంలోని జ్యోతి దానేశ్వరి ఫెర్టిలైజర్స్ షాపులలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. జయలక్ష్మీ ఫెర్టిలైజర్స్ ఎరువుల తయారీ యూనిట్‌లోని ఎరువులు, పురుగు మందులను తనిఖీ చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ ఎంవీ రమేష్ తెలిపారు. ఈ తనిఖీల్లో క్వాలిటీ కంట్రోల్ స్క్వాడ్ గజపతినగరం ఏడీఏ డాక్టర్ కే మహారాజన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ టీ శ్రీనివాసరెడ్డి, తణుకు వ్యవసాయశాఖ ఏడీఏ ఎంవీ రమేష్, క్వాలిటీ కంట్రోల్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణకాంత్, మండల ఏవో కె కుసుమ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు మహిళా అటానమస్ కళాశాలకు నాక్ బి + + గ్రేడ్

తణుకు టౌన్: తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా అటానమస్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ మండలి (నాక్) బీ++ గ్రేడ్‌ను ప్రకటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ తెలిపారు. గత నెలలో నాక్ బృందం తమ కళాశాలను పరిశీలించినట్లు తెలిపారు. తణుకులోని మహిళా కళాశాలను బెంగుళూరుకు చెందిన నాక్ చైర్ పర్సన్ మహేశ్ చంద్ర శ్రీవాస్తవ, మధ్యప్రదేశ్ రేవా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అవదేశ్ ప్రకాష్ సింగ్, నాక్ మెంబర్ సెక్రటరీ పశ్చిమ బెంగాల్ గౌర్‌బంగా యూనివర్సిటీ ప్రొఫెసర్ గౌతమ్ బౌమిక్, సభ్యులు ప్రీత నిలేష్, తదితరులు తమ కళాశాలలోని విద్యా బోధన, సదుపాయాలు వంటి అన్ని విభాగాలను పరిశీలించారని తెలిపారు. అదే విధంగా కళాశాల విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులతో కూడా సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కళాశాలకు నాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను ప్రకటించి గ్రేడ్‌ను పత్రాలను కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ చిట్టూరి సత్య ఉషారాణికి అందజేసినట్లు తెలిపారు.

మురికి కూపంలా దళితవాడ



దళిత వాడలో రోడ్డుపై నిలిచిపోయిన నీటిలోంచి సంచరిస్తున్న దళిత మహిళలు

పాలకోడేరు: మోగల్లు దళితవాడ మురికి కూపంలా మారింది. దళితులు నిత్యం వర్షం నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. 20 ఏళ్ల క్రితం అక్కడ సిమెంట్ రోడ్డు వేశారు. కొంత కాలానికి అది శిథిలమయ్యింది. అప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజలు ఎంతో మొరపెట్టుకుని, ఎన్నో సార్లు విజ్ఞప్తులు చేసుకోగా, చివరకు సిమెంట్ రోడ్డు మంజూరు చేశారు. అయితే నిధులు తక్కువ వచ్చాయంటూ సగం రోడ్డు వేసి, మిగిలిన సగం అలాగే వదిలేశారు. దీంతో వర్షపు నీళ్లన్నీ పల్లపు ప్రదేశంలోకి వచ్చి అక్కడ నిలబడి పోతున్నాయి. వర్షం వచ్చినా రాకపోయినా నీళ్లు మాత్రం అక్కడే తిష్ట వేస్తుండడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఆ నీటిలోనే సంచరిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు.

దళితులపై దాడులను అరికట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు

పాలకొల్లు సెంట్రల్: జిల్లాలో అనేకప్రాంతాల్లో దళితుల శ్మశానవాటిక భూములను కబ్జాలు చేస్తూ.. తిరిగి దళితులపైనే దాడులు చేస్తోన్న భూస్వాములపై కఠిన చర్యలు తీసుకోవాలని పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణికి వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. గత నెల 23వ తేదీన భీమవరం మండలం వెంప గ్రామం పెదపేటలో దళితుల శ్మశాన వాటిక సుమారు 1.85 సెంట్లలో కలిదిండి సుబ్బరాజు దౌర్జన్యంగా తన పొలంలోకి రాత్రికి రాత్రే రోడ్డు వేసుకున్నట్టు తెలిపారు. దీనిపై ప్రశ్నించిన దళితులపై సుబ్బరాజు కిరాయి గూండాలతో దాడులు చేయించారని వివరించారు. ఈ దాడుల్లో ఒక మహిళ, ఆమె కుమారుడు (4) తీవ్ర గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. ఇటువంటి వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఒక్కటే పెట్టారని తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులపై 307, పోక్సో యాక్ట్ కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బండి శ్యామ్‌బాబు, ఇంజేటి కుమారస్వామి, అశోక్ పాల్గొన్నారు.